క్లుప్తంగా

ఎంపీడీఓగా కృష్ణమోహన్ బాధ్యతల స్వీకరణ



కృష్ణమోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల పరిషత్ సిబ్బంది

అల్లవరం: అల్లవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా విరగవరం మండలంలో విస్తరణాధికారిగా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై అల్లవరం ఎంపీడీఓగా వచ్చారు. ఆయనకు కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మణరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని గోడిలోని ఆయన నివాసంలో, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావుని తూర్పులంకలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

పాదచారులకు మజ్జిగ ప్యాకెట్ల అందజేత



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ ౖచైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సాకా ప్రసన్నకుమార్ స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం మధ్యాహ్నం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. మున్సిపల్ ౖచైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఈ చలి వేంద్రం ద్వారా పాదచారులు, వాహన చోదకులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, యన్నాబత్తుల సాయి, చిన్నా, సూదా గణపతి పాల్గొన్నారు.

50వ రోజుకు చేరిన 'చాంబర్' చలివేంద్రాలు

ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణంలో పలు చోట్ల ఏర్పాటుచేసిన చలి వేంద్రాలు 50వ రోజుకు చేరుకున్నాయని చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తెలిపారు. స్థానిక శుభ కలశం సెంటరు చలివేంద్రంలో తాతాజీ పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్న జిల్లా కార్మిక అధికారిణి నాగలక్ష్మి

అమలాపురం టౌన్: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో అమలాపురం పుర వీధుల్లో సోమవారం ఉదయం అవగాహన ర్యాలీ జరిగింది. జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి అధికారిణి, సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, సహాయ కార్మిక అధికారి పీఎస్ మహేష్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూలు సెంటరు నుంచి ఈదరపల్లి వంతెన వరకూ కిలోమీటరు మేర ర్యాలీ సాగింది. బాలలకు 'పని వద్దు.. బడి ముద్దు' అని రాసిన ప్లకార్డులతో విద్యార్థులు నినదించారు. ఈ సందర్భంగా జిల్లా కార్మిక అధికారిణి నాగలక్ష్మి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో కిమ్స్ నర్సింగ్ కళాశాల, భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాడర్ క్యాంపును విజయవంతం చేయాలి

ముమ్మిడివరం: ఈ నెల 30న నిర్వహించే బహుజన్ సమాజ్ పార్టీ క్యాడర్ క్యాంపు సదస్సును విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు పిలుపునిచ్చారు. ముమ్మిడివరం బళ్ల గేటు సెంటర్‌లో సోమవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్యాడర్ క్యాంపు సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో భీమేశ్వరరావు, పందిరి శ్రీనివాసరావు, కమిడి శ్రీను, మోకా మధు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

ఐ.పోలవరం: ఐ.పోలవరం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. 35 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంఈఓ ఎ.వెంకటేశ్వరావులు హాజరై శిబిరంలో వివిధ పోటీల్లో విజేతలైన చిన్నారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

మారనున్న తెరగతి గది

- ప్రభుత్వ బడుల్లో ప్రారంభం కానున్న డిజిటల్ బోధన
- అందుబాటులోకి రానున్న స్మార్ట్ క్లాస్ రూములు

తాళ్లరేవు: నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన ప్రభుత్వం, విద్యాబోధనలో సైతం ఆధునికతను జోడిస్తూ డిజిటల్ విద్యకు శ్రీకారం చుడుతోంది. త్వరలోనే సర్కారీ బడులు డిజిటల్ మయం కాబోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి రానున్నాయి. హైస్కూల్ స్థాయిలో వీటిని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నారు. ఇప్పటివరకూ బ్లాక్ బోర్డులపై సాగిన విద్యాబోధన ఇకపై ఐఎఫ్‌పీల్లో(ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ఫాం పానెల్స్) జరగనుంది. విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా వినూత్నమైన రీతిలో డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తులు ప్రారంభించింది.

తాళ్లరేవు మండల పరిధిలో నాడు–నేడు తొలివిడత పనులు పూర్తిచేసుకున్న ఏడు పాఠశాలలకు గాను 91 తరగతి గదుల్లో ఈ స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ ఫైబర్‌నెట్ సాయంతో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా ఐఎఫ్‌పీ ద్వారా కూడా డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా డిజిటల్ విద్యా బోధనకు సర్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు తరగతి



డిజిటల్ బోధన కోసం ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ఫాం ప్యానెల్



హైస్కూళ్లకు తరలిస్తున్న ఐఎఫ్‌పీలు

గదులల్లో అవసరమైన ప్రాంతంలో విద్యుత్ సదుపాయం, పాఠశాలలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం తదితర విషయాలపై సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను నాడు–నేడు ఎస్ఎంటీ యాప్‌లో పొందుపరచాలని పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

దృశ్య వీక్షణతో పూర్తి అవగాహన



పాఠశాలల్లో ఏర్పాటుచేస్తున్న ప్యానెల్ బోర్డును బ్లాక్ బోర్డులానే ఉపయోగించవచ్చు. రాసిన దాన్ని చెరపొచ్చు కూడా.. ఇంటర్నెట్‌తో కంప్యూటర్‌లా సైతం వాడుకోవొచ్చు. యూట్యూబ్, ఫోన్ లేదా ట్యాబ్‌లోని సమాచారం సైతం స్క్రీన్‌పై చూసేందుకు అవకాశముంటుంది.

– జొన్నాడ ఆశాలత, ప్రధానోపాధ్యాయురాలు, తాళ్లరేవు హైస్కూల్

తరగతి గదిలో డిజిటల్ ప్రపంచం



ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో ఇక నుంచి డిజిటల్ ప్రపంచాన్ని చూడొచ్చు. సాంకేతికతను జోడించి విద్యాబోధన చేయడం ద్వారా విద్యార్థులకు సబ్జెక్టులపై మంచి అవగాహన కలిగి మంచి ఫలితాలు సాధిస్తారు. డిజిటల్ పాఠాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తాయి.

– పుల్లేటి కిషోర్, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు, తాళ్లరేవు హైస్కూల్

కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు



డిజిటల్ విధానం ద్వారా విద్యా బోధన చేయడం వల్ల కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోకుండా మంచి ఫలితాలు సాధిస్తాం. ప్రతి విషయాన్ని విపులంగా, కూలంకషంగా నేర్చుకోవడం ద్వారా సబ్జెక్టుపై ఆసక్తి పెరగడంతో చదువులో పట్టు సాధించి మా ఉన్నత విద్యకు దోహదపడుతుంది.

– జంపన జనని, పదో తరగతి విద్యార్థిని

గ్రామ స్వరాజ్యాలుగా సచివాలయాలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- చినగాడవిల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఉప్పలగుప్తం: సచివాలయాలను గ్రామ స్వరాజ్యాలుగా ప్రజలందరికీ అందుబాటులో తీసుకొచ్చి సేవలందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని చినగాడవిల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తనయుడు శ్రీకాంత్‌తో కలిసి సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సీఎం జగన్ విద్యా వ్యవస్థకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. కార్పొరేట్ తరహాలో బడులను తీర్చిదిద్దటంతో పాటు విద్యార్థులకు అవసరమైనవన్నీ విద్యా కానుక ద్వారా అందిస్తున్నారన్నారు. అంతేకాకుండా అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా విధానం వంటి పథకాలతో ప్రతి విద్యార్థికి ప్రభుత్వపరంగా సహకారం అందిస్తున్నా



చినగాడవిల్లిలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి విశ్వరూప్

మన్నారు. టీడీపీ హయాంలో హామీలు ఇచ్చి నెరవేర్చలేని చంద్రబాబు మళ్లీ మ్యానిఫెస్టో పెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చటం సీఎం జగన్‌కు మాత్రమే సాధ్యమని తెలిపారు. గ్రామంలో శ్మశాన వాటికకు రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణం, రూ.5 లక్షలతో సచివాలయం పక్కన డ్రెయిన్ నిర్మాణం పనులు వారంలోగా చేయిస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైస్ ఎంపీపీ సాధే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు బద్రి బాబ్జి, జి.వెంకట మహాలక్ష్మి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్



ఆలయ ప్రాంగణంలో అర్చకుల క్వార్టర్స్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు నిమ్మకాయల స్వామి నాయుడు, పార్టీ నాయకులు మచ్చా లోవరాజు, బద్రి వీరబాబు, దొరబాబు పాల్గొన్నారు.

అధ్యాత్మిక కేంద్రంగా వేంకటేశ్వరస్వామి ఆలయం

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం ఈ ప్రాంతానికి ఓ అధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.1.09 కోట్లతో చేపట్టిన మూడు అభివృద్ధి పనులకు మంత్రి విశ్వరూప్ సోమవారం ఉదయం శంకస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ౖచైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి అధ్యక్షతన ఆలయంలో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి విశ్వరూప్ పాల్గొని ప్రసంగించారు. ఆలయ ఆవరణలో రూ.75 లక్షలతో నిర్మిస్తున్న అర్చకుల క్వార్టర్స్‌కు, రూ.28 లక్షలతో కోనేరు ఆధునీకరణ పనులకు మంత్రి విశ్వరూప్ శంకుస్థాపనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ రూ.6 లక్షలతో నిర్మించిన వేంకటేశ్వర ఉద్యాన వనాన్ని మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన మంత్రి విశ్వరూప్‌కు ఆలయ ౖచైర్‌పర్సన్ వీరీతాదేవి, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఫణి దంపతులు, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- విద్యార్థులకు విద్యా కానుక కిట్ల పంపిణీ

ముమ్మిడివరం: ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. విద్యారంగంలో అమ్మఒడి, విద్యాకానుక, వసతి దీవెన, విద్యాదీవెన వంటి పథకాలతో పాటు పాఠ్య ప్రణాళిక, మౌలిక సదుపాయాల కల్పన పరంగా ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులకు ఇంగ్లిష్ చదువులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ౖచైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జి, రెడ్డి శివన్నారాయణ, సరిపెల్ల రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుకలతో విద్యాలయాలు కళకళ

అమలాపురం టౌన్: జగనన్న విద్యా కానుకలతో విద్యాలయాలన్నీ కళకళలాడుతున్నాయని మున్సిపల్ ౖచైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక



ముమ్మిడివరంలో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

వెత్సావారి అగ్రహారంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జగనన్న విద్యా కానుకల కిట్ల పంపిణీ కార్యక్రమంలో ౖచైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బందా కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పిండి రాజా, న్యాయవాది సుబ్రహ్మణ్యం దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక కొంకాపల్లిలోని జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ ౖచైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.

నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు

అల్లవరం: విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు.



జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న మున్సిపల్ ౖచైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అల్లవరం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జగనన్న విద్యా కానుకల పంపిణీ సోమవారం నిర్వహించారు. అనంతరం గోడిలోని బాలుర గురుకులంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు బొమ్ము బాలవేణి, తోట శ్రీదేవి, ఎంపీటీసీలు ఎస్.మౌనిక, కాండ్రేగుల శ్రీవాణి, బసవా వరహాలు పాల్గొన్నారు.

కానుకలను సద్వినియోగం చేసుకోవాలి

ఐ.పోలవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజులు అన్నారు. ఐ.పోలవరం జెడ్పీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జెవీకే కిట్లను వారిద్దరూ పంపిణీ చేశారు.



అల్లవరం హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

జగనన్న విద్యాకానుకల అందజేత

తాళ్లరేవు: సోమవారం స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.మంగాయమ్మ, పాఠశాల హెచ్ఎం జొన్నాడ ఆశాలత, స్కూల్ కమిటీ ౖచైర్మన్ మట్టపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన: కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాలలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలెపు ధర్మారావు, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు తదితరులు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం అందజేశారు.

గడప గడపకూ సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- నగర పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ఇంటింటా సంక్షేమ వెలుగులు కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 7 వార్డు అగ్రహారంలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని సైతం సీఎం జగన్ నెరవేర్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ౖచైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, పార్టీ టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, కౌన్సిలర్ గంజా శ్రీనివాస్, రెడ్డి శివన్నారాయణ, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు పాల్గొన్నారు.



గడప గడపకూ కార్యక్రమంలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

ప్రజారంజక పాలన జగనన్నతోనే సాధ్యం

ఐ.పోలవరం: ప్రజారంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శ్రీకారం చుట్టారు. తిళ్లకుప్పలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.59.40 లక్షల నిధులతో ఇంటింటికీ కుళాయి, నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే పొన్నాడ ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక మహిళలకు తాగునీటి బిందెను అందజేశారు. మాన్యంపాలెం



తిళ్లకుప్పలో మహిళకు మంచినీటి బిందెను అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

జైభీంనగర్‌లో రూ.40.50 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన ఇంటింటికీ కుళాయి, వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి నియోజకవర్గంలో 81 గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామని, త్వరలో అవి అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్‌లు కడియం తమ్మయ్య, బీర సత్యకుమారి, మోర్త చిన్నా, వడ్డి గౌతమ్, కె.దుర్గా ప్రసాద్, కాశే రాజుబాబు, పి.వాసురాజు తదితరులున్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులతో ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు సోమవారం మలికిపురంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్ ఉద్యోగుల విషయంలో కూడా మంచి నిర్ణయం తీసుకుని ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హామీ పట్ల కాంట్రాక్టు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. బి.ఎస్.నరసింహరావు, సీహెచ్‌వీ ప్రసాద్, పి.కుమార్‌రాజు, డీఎస్ఎన్ మూర్తి, జె.రాజబాబు, డీఎస్ఎన్ మూర్తి, కె.చంద్రరావు, జీవీవీ రమణ, రవి, మంగతాయారు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం సబ్‌స్టేషన్, 11 కేవీ భీమనపల్లి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత, లైను మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి, నంగవరం, విలసవిల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ ఎం.రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమనసలో వారాహి హోమం



వారాహి హోమంలో పాల్గొన్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గేటెడ్ కమ్యూనిటీలో వారాహి నవరాత్రులు ప్రారంభంలో భాగంగా గౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో గాయత్రీ సహిత వారాహి హోమం సోమవారం జరిగింది. అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో మద్దింశెట్టి ఖజానా, అనుపమ, అమృత, విజేత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పిల్లలకు జన భాగీదారి



జనభాగీదారి కార్యక్రమం ద్వారా పిల్లలకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సచివాలయ పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు జన భాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకాలతో ఆటపాటల ద్వారా విద్యను అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.ధనలక్ష్మి, ఎల్.సూరిలక్ష్మి, ఐ.నాగభారతి, వి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

యానాం: బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు మోయాల్సిన బాలల చేతులు బరువైన మూటలను మోస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సిబ్బంది కె.దేవిశ్రీదేవి, నూకరత్నం, గీత, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన 108 వాహనాన్ని సమకుర్చాలి

ఉప్పలగుప్తం: మండలానికి చెందిన 108 వాహనం మరమ్మతులకు గురైన నేపథ్యంలో దాని స్థానంలో కొత్త వాహనాన్ని ప్రవేశపెట్టాలని పలువురు నాయకులు సోమవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలసి విన్నవించుకున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ వెంటనే కొత్త అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి కొత్త అంబులెన్స్‌ను ఏర్పాటుచేస్తానన్నారని సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి శ్రీవెంకట సుబ్బరాజు, మోటూరి సత్యంకాపు, కుంచే చిన్ని తదితరులు ఉన్నారు.

జట్టు కార్మిక సంఘం నిరసన

అమలాపురం రూరల్: వేతన సమస్య పరిష్కారం కోసం రైస్ మిల్లు జట్టు కార్మిక సంఘం కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తూ రైస్ మిల్లు కార్మికులకు పెరిగిన ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఎన్నిసార్లు వినతి పత్రం ఇచ్చినా న్యాయం జరగలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో యూనియన్ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి రాంబాబు, చల్ల శ్రీను, నల్లా శ్రీను పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ

అమలాపురం రూరల్: అమలాపురం లయన్స్ క్లబ్ సేవ మహోత్సవంలో భాగంగా ఇద్దరు వ్యక్తులకు ఉషా కుట్టు మిషన్, వెట్ గ్రైండర్‌ను క్లబ్ సభ్యులు సోమవారం వితరణ చేశారు. లయన్ క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్ వర్మ, పీడీజీ లయన్స్ డాక్టర్ పీఎస్ శర్మ, కార్యదర్శి కాండ్రేగుల మల్లేశ్వరరావు, కోశాధికారి పంపన సూర్యతేజ, రీజియన్ ౖచైర్మన్ ఎంవీఎస్ఎస్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

అమలాపురం రూరల్: ఈదరపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత బొంతు పల్లయ్య మృతికి అమలాపురం, అయినవిల్లి, మామిడికుదురు జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గన్నవరం శ్రీనివాసరావు, కసిరెడ్డి అంజిబాబు, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ తదితరులు సంతాపం తెలియజేశారు. సోమవారం పల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

తాగునీటి కోసం వినతి

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో తాగునీరు సక్రమంగా సరఫరా కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జనసేన పార్టీ కౌన్సిలర్లు పిండి అమరావతి, గొలకోటి విజయలక్ష్మి తదితరులు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి సోమవారం ఆయన చాంబర్‌లో వినతి పత్రాన్ని అందజేశారు.